క్లుప్తంగా

ముగిసిన క్రికెట్ ప్రీమియర్ లీగ్


ట్రోఫీ అందుకుంటున్న విజేత జట్టు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం మున్సిపల్ మైదానంలో నిర్వహిస్తున్న క్రికెట్ ప్రీమియర్ లీగ్ మంగళవారం ముగిసింది. టోర్నీలో ఆర్‌జేఎం జట్టు విజేతగా, ఫ్రెండ్స్ 11 టీం రన్నర్‌గా నిలిచాయని, ఆచార్య టీం మూడవ స్థానంలో నిలవగా మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ట్రోఫీ నాగ గెలచుకున్నారని నిర్వాహకులు తెలిపారు. ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ గంగిరెడ్డి యుగేందర్‌రెడ్డితో పాటు వై.వెంకటేశ్వర్లు, కామేష్, పాండు పాల్గొన్నారు.

వీల్‌చైర్ వితరణ


వీల్‌చైర్ అందజేస్తున్న స్వర్ణలత లెనినా

ఇల్లెందు: ఇల్లెందుకు చెందిన మహ్మద్ ముజాహిద్ ఉచితంగా తన ఆటోలో వికలాంగులు, గర్భిణులను ఆస్పత్రి నుంచి ఇంటికి ఇంటి నుంచి ఆస్పత్రికి తరలిస్తుంటారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అతనికి వీల్‌చైర్ అందజేయాలని మహిళా శిశు వయోవృద్ధుల దివ్యాంగుల సంక్షేమ జిల్లా అధికారి స్వర్ణలత లెనినాను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఆయనను కలెక్టరేట్‌కు ఆహ్వానించి వీల్‌చైర్ అందజేసి అభినందించారు.

టీఎస్‌టీటీఎఫ్ సభ్యత్వ నమోదు


సభ్యత్వం అందజేస్తున్న రాములు

జూలూరుపాడు: టీఎస్‌టీటీఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం జూలూరుపాడులో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ రాములు నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉద్యోగ, ఉపాధ్యాయుల పీఆర్‌సీని తక్షణమే ప్రకటించాలని, అదే విధంగా 5 డీఏలను ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బానోత్ శ్రీను నాయక్, జిల్లా అధ్యక్షుడు భూక్యా మోహన్ రాథోడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సపావత్ బాలకృష్ణ చౌహాన్, జిల్లా కార్యదర్శి బి.నేతాజీ, మండల అధ్యక్షుడు గుగులోత్ సీతారాములు, ప్రధాన కార్యదర్శి ధరావత్ హనుమా జాదవ్, మాలోత్ శంకర్, బానోత్ కృష్ణ, శ్రీను పాల్గొన్నారు.

ప్రముఖుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలి


శరత్‌చంద్రను సన్మానిస్తున్న అధ్యాపకులు

పాల్వంచ: ప్రముఖుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు తమ జీవితాలను తీర్చిదిద్దుకునేందుకు కృషి చేయాలని ప్రముఖ ఐఈఎల్‌టీఎస్ ట్రైనర్ అంబటిపూడి శరత్‌చంద్ర అన్నారు. మంగళవారం స్థానిక తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కేరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్జెక్టుల వారీగా వారికి వివరించారు. అనంతరం మాట్లాడుతూ... విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రణాళికా బద్ధంగా చదివి ఎదగాలన్నారు. అనంతరం శరత్‌చంద్రను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ఝాన్సీరాణి, వైస్ ప్రిన్సిపాల్ జ్వలిత, ఇంగ్లిష్ అధ్యాపకులు జె.పద్మలత, కె.లక్ష్మీప్రసన్న, అధ్యాపకులు పాల్గొన్నారు.

సింగరేణి అధికారుల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలోని ఇంజనీరింగ్ అండ్ మెకానికల్ (ఈఅండ్ఎం) విభాగం ఇద్దరు అధికారులను బదిలీ చేస్తూ సోమవారం రాత్రి యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో న్యూఢిల్లీలోని రెసిడెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న అవినాష్ దూబే (డీవైజీఎం ఈ అండ్ ఎం)ను పవర్ ప్రాజెక్ట్ జైపూర్ (రాజస్థాన్)కు, మంద మర్రి ఏరియా కేకేఓసీపీలో ఈఈ (ఈ అండ్ఎం)గా విధులు నిర్వహిస్తున్న రాహుల్ గుప్తాను పవర్ ప్రాజెక్ట్ జైపూర్ (రాజస్థాన్)కు బదిలీ చేసింది.

అటకెక్కిన సెంట్రల్ లైటింగ్ !

- అంధకారంలో బీసీఎం రోడ్డు
- రూ.2.1 కోట్ల వ్యయంతో లైట్ల ఏర్పాటు
- పట్టించుకోని అధికారులు, పంచాయతీలు


బీసీఎం జాతీయ రహదారిపై వెలుగులు పంచని సెంట్రల్ లైటింగ్

పాల్వంచరూరల్: రూ.కోట్లు ఖర్చు చేసి భద్రాచలం జాతీయ రహదారిపై ఏడాదిన్నర క్రితం ఎర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ నేటికీ వెలగడం లేదు. మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లి నుంచి పెద్దమ్మతల్లి గుడి వరకు రూ.2.1 కోట్ల వ్యయంతో సీఎస్ఆర్ పాలసీ నిధుల కింద 2022లో మంజూరైన నిధులతో సెంట్రల్ లైటింగ్ నిర్మాణాన్ని 2023 అక్టోబర్‌లో పూర్తిచేశారు. పంచాయతీరాజ్ శాఖ ఇంజనీర్ విభాగం పర్యవేక్షణలో ఆరు కిలోమీటర్ల పొడవున బీసీఎం జాతీయ రహదారి డివైడర్ మధ్యలో 135 పోల్స్‌తో నిర్మాణం చేశారు. ఇందిరానగర్ కాలనీ పెట్రోల్ బంక్ దగ్గర నుంచి లక్ష్మీదేవిపల్లి, బస్వతారక కాలనీ, కేశవాపురం, జగన్నాథపురం నాలుగు గ్రామపంచాయతీల పరిధిలో ఏర్పాటు చేశారు. కానీ అవి వెలగకపోవడంతో జాతీయ రహదారి అంధకారంలో మగ్గుతోంది. నిత్యం వాహనాల రద్దీ ఉండే లక్ష్మీదేవిపల్లి నుంచి పెద్దమ్మగుడి వరకు డివైడర్ మధ్యలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ వెలగకపోవడంతో రాత్రి సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా ఏ అధికారీ స్పందించడం లేదు. లైటింగ్ పోల్స్‌ను వాహనాలు ఢీకొట్టిన ప్రమాదంలో కేశవాపురం గ్రామం వద్ద రెండు పోల్స్ విరిగిపోయాయి. కొన్ని స్తంభాలకు లైట్లను కూడా అమర్చకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలి..

బీసీఎం జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ వెలగాలంటే మూడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు చేయాలంటే డివైడర్ నుంచి రహదారి మధ్యలో వైర్లను అమర్చాల్సి ఉంది. ఇందుకు రోడ్డును పగలగొట్టితే తప్ప సాధ్యం కాదు. కానీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంలో సంబంధిత అధికారులు జాప్యం చేయడంతో రూ.కోట్లు వ్యయం చేసిన సెంట్రల్ లైటింగ్ ప్రయోజనం లేకుండా పోయింది.

విద్యుత్ భారం భరించేదెవరు..?

సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసిన తర్వాత విద్యుత్ భారాన్ని మొదట నాలుగు గ్రామ పంచాయతీలు భరించాల్సి ఉంటుందని అధికారులు ఆయా పంచాయతీల అధికారులకు, అప్పటి పాలకవర్గాలకు అధికారులు ఆదేశించారు. అయితే గ్రామపంచాయతీలో నిధుల కొరత కారణంగా సెంట్రల్ లైటింగ్ విద్యుత్ భారాన్ని మోయలేమని పంచాయతీ అధికారులు స్పష్టం చేశారు. దీంతో లైట్ల విద్యుత్ భారాన్ని అధికారులు మున్సిపాలిటీకి అప్పగించాలని ప్రయత్నాలు చేశారు. కానీ మున్సిపల్ కమిషనర్ అంగీకరించలేదు. దీంతో సెంట్రల్ లైటింగ్ ఇప్పట్లో వెలిగే పరిస్థితి లేదు. దీనిపై పంచాయతీరాజ్ ఏఈ శివలాల్‌ను వివరణ కోరగా.. సెంట్రల్ లైటింగ్ విద్యుత్ సరఫరాకు మూడు


కేశవాపురం వద్ద విరిగిన స్తంభం

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు విద్యుత్ శాఖ అధికారులకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. సుమారు రూ.10 లక్షల ఖర్చు అవుతుందని అవసరమైన నిధుల కోసం కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లామని, కలెక్టర్ సీఎస్ఆర్ నిధులు ఇవ్వాలని జెన్కో అధికారులకు కూడా సిఫార్స్ చేసినట్లు చెప్పారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి..



సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తే సంతోషపడ్డాము. కొద్దిరోజులు మాత్రమే వెలిగించారు. ఆ తర్వాత అటకెక్కింది. రాత్రి సమయంలో వెలగకపోవడం వలన ప్రమాదాలు సంభవిస్తున్నాయి. లారీలు విద్యుత్ పోల్స్‌ను ఢీకొన్న సంఘటనలు కూడా ఉన్నాయి. రాత్రి సమయంలో ప్రధాన రహదారిపై ఇబ్బంది లేకుండా లైట్లను వెలిగించాలి.

– వీరభద్రం, జగన్నాథపురం

ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలి..



బీసీఎం జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ వెలగక పోవడం వలన రాత్రి సమయంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి సెంట్రల్ లైటింగ్‌కు అవసరమైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి ప్రతీరోజు లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలి. ప్రమాదాలను అరికట్టాలి.

– ఆసిఫ్, లక్ష్మీదేవిపల్లి

శంభాజీ మహరాజ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి


నినాదాలు చేస్తున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: ఛత్రపతి శంభాజీ మహరాజ్ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని వక్తలు తెలిపారు. మంగళవారం కొత్తగూడెం రైల్వేస్టేషన్ ఆవరణలో వీర శివాజీ మహరాజ్ సేన ఆధ్వర్యంలో ఛత్రపతి శంభాజీ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆళ్ల మురళి, రంగాకిరణ్ మాట్లాడుతూ.. నమ్మిన ధర్మం కోసం తన ప్రాణాలను త్యజించిన మహా యోధుడని, ఆయన త్యాగం మరువలేనిదన్నారు. మొఘల్ పాలకులకు ముచ్చెమటలు పట్టించిన ధీశాలి అని కొనియాడారు. శంభాజీ మహరాజ్ పరాక్రమం చూసి భయపడిన ఔరంగజేబు శంభాజీ మహరాజ్‌ను బంధీగా పట్టుకుని చిత్రహింసలకు గురిచేసినా తాను నమ్మిన ధర్మం కోసం ప్రాణాలను అర్పించిన గొప్ప మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఊకంటి గోపాలరావు, కోనేరు చిన్ని, వై.శ్రీనివాస రెడ్డి, కెకె.శ్రీను, వాసు, ప్రసాద్, జోగు ప్రదీప్, మహేష్, కిరణ్, దిలీప్, రాజేష్ పాల్గొన్నారు.

భూ వివాదంపై నేడు విచారణ

ఇల్లెందురూరల్: ఇంటిగ్రేటెడ్ గురుకుల భవన నిర్మాణం కోసం రెవెన్యూ అధికారులు ఎంపిక చేసి స్వాధీనం చేసుకున్న స్థలం సర్వే నంబర్లపై వివాదం వివాదం చోటుచేసుకుంది. తరతరాలుగా సాగులో ఉన్న రైతులు తమకు న్యాయం చేయాలని కోరుతూ కోర్టును ఆశ్రయించారు. దీంతో అధికారులు స్వాధీనం చేసుకున్న స్థలం సర్వే నంబర్‌పై స్పష్టతనివ్వాలని, దీనికోసం సర్వే నంబర్ 618, 549 పరిధిలో సాగులో ఉన్న రైతుల సమక్షంలో పలు విభాగాలకు చెందిన ఉన్నత స్థాయి అధికారుల పర్యవేక్షణలో సర్వే చేసి హద్దులు నిర్ధారించాలని కోర్టు ఆదేశించింది. కోర్టు ఆదేశం మేరకు రెవెన్యూ అధికారులు సాగులో ఉన్న 17 మంది రైతులు, వివిధ శాఖలకు చెందిన 11 మంది అధికారులు మొత్తం 27 మందిని ప్రతినిధులుగా నిర్ధారించి మంగళవారం నోటీసులు జారీ చేసింది. బుధవారం ఉదయం 10 గంటలకు సర్వే ప్రారంభమవుతుందని, నోటీసు అందుకున్న ప్రతీఒక్కరు సకాలంలో సర్వేకు హాజరు కావాలని రెవెన్యూ అధికారులు నోటీసులో పేర్కొన్నారు.

పాఠశాలల్లో తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ప్రభుదయాళ్

కొత్తగూడెంఅర్బన్: మండలంలోని పలు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను మంగళవారం మండల విద్యాశాఖ అధికారి ప్రభుదయాళ్ ఆకస్మికంగా సందర్శించారు. హనుమాన్ బస్తీ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన తయారీని పరిశీలించారు. అనంతరం బూడిదగడ్డ, టూ ఇంక్లైన్ పాఠశాలలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. మాట్లాడుతూ.. విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలోనే విద్యా పునాదులు పటిష్టంగా ఉండాలన్నారు. ప్రతిభ చూపించే విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు.

ముస్లింలను బీసీ – ఈ జాబితాలో చేర్చండి..

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్రంలో వెనకబడి ఉన్న ఓసీ ముస్లింలను బీసీ – ఈ జాబితాలో చేర్చాలని జిల్లా మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ యాకూబ్‌పాషా మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నవంబర్, డిసెంబర్‌లో రాష్ట్ర ప్రణాళికా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో 8, 80, 424 (2.36 శాతం) ఓసీ ముస్లింలుగా గుర్తించటం జరిగిందని, ఈ ముస్లింలలో సయ్యద్, పఠాన్‌లతో పాటు మరో 14 ఉపకులాలకు చెందిన వారున్నారని, వీరిలో దాదాపు 80 శాతం మంది ఆర్థికంగా, విద్యాపరంగా వెనకబడి ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రిజర్వేషన్లకు దూరమవుతున్నారని తెలిపారు. ఈ వర్గాలలో ఉన్న అత్యంత పేద ముస్లింలను గుర్తించి బీసీ – ఈ లో స్థానం కల్పించే విధంగా ప్రారంభం కానున్న శాసనసభ సమావేశాలలో ప్రజాప్రతినిధులందరూ చర్చించాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


ఆటోడ్రైవర్లకు సూచనలు చేస్తున్న పోలీసులు

జూలూరుపాడు: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి అన్నారు. మంగళవారం ఎస్సై బాదావత్ రవితో కలిసి మండల కేంద్రంలో విస్తృతంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో సీరియల్ నంబర్లు, ఆటో టాప్ నంబర్లతోపాటు, ధ్రువపత్రాలను పరిశీలించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ... ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించడంతోపాటు, అన్ని ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాలను మద్యం సేవించి నడపరాదని, అతివేగం ప్రమాదానికి కారణమన్న విషయాన్ని ప్రతీఒక్కరు గమనించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఆటోడ్రైవర్లు, వాహనదారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన


పునాదులను పరిశీలిస్తున్న విజయభాస్కరరెడ్డి

పాల్వంచరూరల్: మండలంలోని తోగ్గూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు చేపట్టిన ఇళ్ల పునాదుల నిర్మాణ పనులను మంగళవారం ఎంపీడీఓ కె.విజయ భాస్కరరెడ్డి పరిశీలించారు. గ్రామంలో ఇందిరమ్మ పథకం కింద మొదటి విడత 129, రెండో విడతలో 82 మొత్తం 208 ఇళ్లు మంజూరయ్యాయి. ఎంపీడీఓ వెంట ఏపీఓ రంగా, గ్రామ కార్యదర్శి రవి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

టేకులపల్లి: బేతంపూడి గ్రామానికి చెందిన చేతుల రాములు ఈనెల 7న టేకులపల్లిలో రోడ్డు ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు మంగళవారం టేకులపల్లి బైతుల్లా మసీదు కమిటీ ఆధ్వర్యంలో ముస్లిం పెద్దలు బేతంపూడి గ్రామానికి వెళ్లి రాములు తల్లికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

పాల్వంచరూరల్: పురిటినొప్పులతో బాధపడుతున్న ఆదివాసీ గిరిజన మహిళను కాన్పు కోసం ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా అంబులెన్స్‌లోనే ప్రసవం జరిగింది. వివరాలు.. దంతలబోరు గ్రామపంచాయతీలోని మారుమూల ప్రాంతమైన కనీసం రహదారి సౌకర్యం కూడా లేని సీతారాంపురం గ్రామానికి చెందిన ఎడమమ్మను మంగళవారం డెలివరీ కోసం పాల్వంచ ఏరియా ఆస్పత్రికి 108 వాహనంలో తీసుకెళ్తుండగా మార్గం మధ్యలో పురిటినొప్పులు రావడంతో ఈఎంటీ సుజాత డెలివరీ చేశారు. ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని ఏరియా ఆస్పత్రిలో చేర్పించి వైద్యుల పర్యవేక్షణలో ఉంచినట్లు పైలెట్ తులసిరాం తెలిపారు.

24 గంటలూ అందుబాటులో అంబులెన్స్

పాల్వంచరూరల్: ఉల్వనూరు గ్రామంలోని గిరిజన ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం ఖమ్మం జిల్లా ప్రోగ్రాం మేనేజర్ భూమా నాగేందర్ డెమో నిర్వహించారు. మాట్లాడుతూ.. నవజాత శిశువులకు, చిన్నపిల్లలకు కావాల్సిన అన్నిరకాల సదుపాయాలు, నియోనటల్ అంబులెన్స్‌లో అందుబాటులో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అంబులెన్స్ సిబ్బంది 24గంటలూ అందుబాటులో ఉంటారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డాక్టర్ దేవేందర్, జిల్లా సమన్వయ కర్త ఆలేటి ప్రణయ్‌కుమార్, నియోనటల్ సిబ్బంది, ఈఎంటీ అశోక్, పైలెట్ రవికుమార్ పాల్గొన్నారు.

పంటలకు మద్దతు ధర కల్పించండి..


ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక కార్పొరేట్ అనుకూల విధానాలపై సంయుక్త కిసాన్ పోరాటం చేస్తుందని అఖిల భారత ఐక్య రైతుసంఘం, సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి కల్లూరి కిషోర్ అన్నారు. జాతీయ కమిటీ పిలుపులో భాగంగా కలెక్టర్ కార్యాలయం ఎదుట మంగళవారం ఈ మేరకు ధర్నా నిర్వహించి కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రైతాంగం నడ్డి విరుస్తూ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించే కుట్రలు పన్నుతోందని విమర్శించారు.

రైతాంగం 13 నెలల పాటు ఢిల్లీ రహదారులపై ధర్నాలు చేసి సాధించిన మూడు చట్టాల రద్దును దొంగదారిలో జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ ముసాయిదా పేరుతో తీసుకరావడం చూస్తుంటే మోదీ ప్రభుత్వం ఎవరికోసం పనిచేస్తుందో తెలుస్తోందని ఆరోపించారు. రైతాంగం పండించిన పంటలకు మద్దతు ధర లభించక అప్పుల పాలై అనేకమంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే, మద్దతు ధరల చట్టం చేయమని అడుగుతుంటే పట్టించుకోని ప్రధాని మోదీ కార్పొరేటర్ల కోసం మాత్రం వేగంగా వ్యవసాయరంగంలో మార్పులు తీసుకొస్తున్నారని ధ్వజమెత్తారు. సమస్యలు పరిష్కరించే వరకు పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అమర్లపూడి రాము, రాంబాబు, గోకినపల్లి ప్రభాకర్, నిమ్మల రాంబాబు, జాటోత్ కృష్ణ, బుర్రా వెంకన్న, భానోత్ ధర్మా, కొండబోయిన వెంకటేశ్వర్లు, ఆజ్మీరా బిచ్చ, గాంధీ, ఎస్.నాగేశ్వరరావు, అప్పారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి నిధులు కేటాయించాలి


మాట్లాడుతున్న అభిమన్యు

టేకులపల్లి: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.6500 కోట్ల స్కాలర్‌షిప్ మరియు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బయ్య అభిమన్యు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం టేకులపల్లిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ... రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని కోరారు. జిల్లా పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, జిల్లాలో అద్దె భవనాలలో నిర్వహిస్తున్న వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలయ్యేలా చూడాలని, డైట్ చార్జీలు పెంచేవిధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పదో తరగతి విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం అందించాలని, ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలో ముందస్తు అడ్మిషన్ల ప్రక్రియ నియంత్రించాలన్నారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజులు నియంత్రించాలని డిమాండ్ చేశారు. టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మరమ్మతులు చేపట్టాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, కరుణాకర్, కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక లావాదేవీలపై అవగాహన


మాట్లాడుతున్న రాధికా భరత్

సుజాతనగర్: ఆర్థిక వ్యవహారాలపై ప్రతీ విద్యార్థికి అవగాహన ఉండాలని ఆర్బీఐ ఏజీఎం రాధికా భరత్ అన్నారు. స్థానిక అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో ఆర్థిక విషయాలు, సైబర్ నేరాలపై విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు ఆర్థిక వ్యవహారాల్లో అవగాహన ఉంటే బంగారు భవిష్యత్‌ను నిర్మించుకోవడం సాధ్యమవుతుందన్నారు. డిజిటల్ లావాదేవీల కారణంగా డిజిటల్ భారత్ దిశగా పయనిస్తున్నామని, అదే సమయంలో డిజిటల్ మోసాల గురించి అవగాహనతో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల బారిన పడితే 1930కి ఫోన్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ రామిరెడ్డి, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజినల్ కార్యాలయ అధికారి సునీల్, సుజాతనగర్ టీజీబీ బ్రాంచ్ మేనేజర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

‘నెల్లికంటి’ ఎంపికపై హర్షం


మాట్లాడుతున్న మచ్చా శ్రీనివాసరావు

పాల్వంచ: సీపీఐ నాయకుడు నెల్లికంటి సత్యంను కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్సీగా ఎంపిక చేయడం హర్షణీయం అని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మచ్చా శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరులతో మాట్లాడుతూ... మారుమూల సామాన్య కుటుంబంలో పుట్టిన సత్యం భారత కమ్యూనిస్ట్ పార్టీలో ఎంతో నిబద్ధతతో, ప్రజా సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేశారని, అతని కృషిని గుర్తించి పార్టీ ఎమ్మెల్సీగా ఎన్నుకోవడం అభినందించదగ్గ విషయం అన్నారు. పార్టీ అతనికి సముచిత స్థానం కల్పించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వల్లపు యాకయ్య, కుక్కల సాంబయ్య, మార్గం అంకయ్య, మారుతి శ్రీను, గుండాల నాగరాజు, ఎర్రగడ్డ శ్రీను, కొమరయ్య, కె.జైపాల్, కృష్ణమూర్తి, వెంకన్న పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీపై సింపోజియం


రామ్‌కుమార్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో మంగళవారం సైబర్ సెక్యూరిటీ అనే అంశంపై సింపోజియం నిర్వహించారు. ప్రిన్సిపాల్ సీహెచ్ శారద ఆధ్వర్యంలో కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ ఎ.దేవకి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా సింగరేణి ఐటీ జనరల్ మేనేజర్ జి.రామ్‌కుమార్, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎం.శ్రీనివాసరావు హాజరయ్యారు.

మాట్లాడుతూ... సైబర్ నేరాలను అరికట్టాలంటే స్ట్రాంగ్ పాస్‌వర్డ్‌లను కలిగి ఉండాలని, తెలియని మెయిల్స్ నుంచి వచ్చే లింకులను ఓపెన్ చేయవద్దని, అనుమానాస్పద మెయిల్స్ వచ్చినపుడు సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. మహిళలు, బాలికలు సైబర్ దాడులకు ఎక్కువగా గురవుతుంటారని, ప్రపంచంలో మూడింట ఒక వంతు కంటే ఎక్కువ మహిళలు ఆన్‌లైన్‌లో వేధింపులు అనుభవించారని వివరించారు. అనంతరం అతిథులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పి.విశాలిని, కె.స్వరూపరాణి, జి.విజయ, సీహెచ్ విమల, డాక్టర్ షాహిన్ లాయక్, డాక్టర్ జి.శైలజ, వి.రజని, ఎం.శైలజ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ కార్మికులు

కొత్తగూడెంటౌన్: బంగ్లోస్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం ఇల్లెందు క్రాస్‌రోడ్డులోని బంగ్లోస్ డిస్ట్రిబ్యూషన్ పాయింట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి ఎర్రగాని కృష్ణయ్య మాట్లాడుతూ.. ఉపాధ్యక్షుడు కేడబ్ల్యూ కిష్టఫర్ మాట్లాడుతూ... సింగరేణి బంగ్లోస్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సింగరేణి యాజమాన్యం కనీస సౌకర్యాలలో భాగంగా ప్రతీరోజు ఉదయం టీ, టిఫిన్లు అందజేయాలని, అదేవిధంగా బాత్‌రూం, వెహికల్ స్టాండ్, డిస్ట్రిబ్యూషన్ పాయింట్ వద్ద షెల్టర్లను ఏర్పాటు చేయాలన్నారు. కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఇప్పటికైనా సింగరేణి అధికారులు కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు జి.రంజిత్, ఏ.రాజు. చుక్కయ్య, కళ్యాణ్, కృష్ణమూర్తి, మణెమ్మ, ఆదిలక్ష్మి, సూజాత, సుశీల పాల్గొన్నారు.